ప్రజాశక్తి

సోమవారం 9 జూన్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

చదువుకు దూరం-పనుల్లో బాల్యం

యథేచ్ఛగా బాలకార్మికుల వినియోగం - గుర్తించినా బాలల సంక్షేమంపై చిన్నచూపు

గుంటూరులో బాలకార్మికుని చేత యోగాంధ్ర హోర్డింగ్ కట్టిస్తున్న కాంట్రాక్టు సంస్థ ఉద్యోగి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో బాలకార్మికులు పెరుగుతున్నారు. చదువుకోవాల్సిన వయస్సులో పనులకు వెళుతున్నారు. ఆడుకోవాల్సిన వయస్సులో బానిస జీవితం అనుభవిస్తున్నారు. దుకాణాలు, సినిమా థియేటర్లు, పెట్రోలు బంకులు, వాణిజ్యసంస్థలు, ఇళ్లల్లో, పరిశ్రమలు, కర్మాగారాల్లో గోప్యంగా పనులు చేయిస్తున్నారు. చిరు వ్యాపారుల వద్ద వస్తువుల విక్రయానికి బాలకార్మికులను వినియోగిస్తున్నారు. వ్యవసాయ కార్మికులుగా పనులకు వెళ్తున్నారు. వేర్వేరు కారణాల వల్ల విద్యకు దూరమైన బాలలను పలు సంస్థల ద్వారా పనుల్లో వినియోగించుకుంటున్నారు. పారిశుధ్య కార్మికులుగా, పాలు, పెరుగు విక్రయాల్లో ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలు, మిర్చి తొడాలు తీసే ప్రాంతాల్లో, మెకానిక్ షెడ్లు, రెడీమెడ్ దుకాణాల్లో బాలకార్మికులకు ఎక్కువగా కన్పిస్తున్నారు. అంతేగాక పలు కాంట్రాక్టు సంస్థల్లో రహస్య జరిగే పలు నిర్మాణాలు, అంతర్గతంగా జరిగే డిజైన్ పనులు, వస్తువుల తయారీలో వీరిని వినియోగిస్తున్నారు. కొంతమంది పేదరికం వల్ల కుటుంబ భారాన్ని నెత్తిన పెట్టుకుని పనుల్లోకి వెళ్తున్నారు. బాల కార్మికులకు తక్కువ వేతనానికి వస్తుండటంతో వ్యాపారులు వీరిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. చిన్నారులను పనుల్లో పెట్టుకోవడం నేరమే అయినా కొంత మంది వ్యాపారులు, సంస్థల 2లో

డిఇఒ ఆఫీసును ముట్టడించిన ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యాయులు

వెబ్ కౌన్సెలింగ్ వద్దేవద్దు

- డిఇఒ ఆఫీసును ముట్టడించిన ఎస్‌జిటిలు
- మాన్యువల్ కౌన్సెలింగ్ హామీని విస్మరించారని ప్రభుత్వంపై ఆగ్రహం

ప్రజాశక్తి-గుంటూరు

సెకండరీ గ్రేడ్ టీచర్లకు బదిలీల ప్రక్రియలో వెబ్ కౌన్సెలింగ్ విధానం అంగీకరించబోమని, మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. వెబ్‌కౌన్సెలింగ్‌ను ఉపసంహరించుకోవాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ ముట్టడిలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వందలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు కె.బసవలింగారావు, ఎం.కళాధర్, డి.పెదబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్‌జిటి బదిలీల కౌన్సెంగ్‌పై ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. బదిలీల ప్రక్రియకు ముదు ఉపాధ్యాయ సంఘాలతో అధికారులతో చర్చల సందర్భంగా ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరగా అధికారులు అంగీకరించారన్నారు. వేల సంఖ్యలో ఉన్న ఎస్‌జిటిలకు వెబ్‌కౌన్సెలింగ్ విధానం సరికాదని, అనేక సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. ఉపాధ్యాయులు వేల సంఖ్యలో వెబ్ ఆప్షన్లు పెట్టుకోవటం కూడా సాధ్యం కాదన్నారు. కావున మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరగా మొదట అంగీకరించిన ప్రభుత్వం ఆచరణలో వెబ్ కౌన్సెలింగ్‌కు అనుగుణంగా చర్యలు చేపడుతోందని, విద్యాశాఖ అధికారుల ద్వారా ఉపాధ్యాయులకు ఫోన్లు చేసి వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పి ఉపాధ్యాయుల్ని వంచించిటం సరికాదన్నారు. తక్కువ సంఖ్యలో ఉండే స్కూల్ అసిసెంట్లు బదిలీల్లోనే వెబ్‌కౌన్సెలింగ్ విధానంలో అనేక తప్పులు దొర్లాయని, ఒకే ప్లేస్ ఇద్దరికి కేటాయించారని, సీనియార్టీ జాబితాలోనూ అనేక తప్పులు దొర్లాయని తెలిపారు. 50 ఆప్షన్లు పెట్టుకోవాటానికి రెండు గంటలకుపైగా సమయం పట్టిందన్నారు. ఇప్పుడు ఎస్‌జిటిలు రెండు, మూడువేలకుపైగా ఆప్షన్లు పెట్టుకోవటం ఆచరణ సాధ్యం కాదన్నారు. తక్షణమే వెబ్‌కౌన్సెలింగ్ విధానాన్ని ఉపసంహరించుకొని మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. అనంతరం ఐక్యవేదిక నాయకులు యు.రాజశేఖర్‌రావు, ఎం.శ్రీనివాసరావు, సుధీర్‌బాబు, సుబ్బారెడీ, మహమ్మద్ ఖాలీద్, నరసింహారావు, సంపత్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు నాయకులు సోషలిజం, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రజిత్, మహమ్మద్ ఉస్మాన్, మోహనరావు, రామకృష్ణ, వీరంజనేయులు, శ్రీనివాసరావు, సాంబయ్య, రామచంద్రయ్య పాల్గొన్నారు.

కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

- బ్యాంకు అప్పులు పుట్టకే ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో అప్పు
- పంట కొనేవారూ లేక మరింత నష్టాల్లోకి
- శివశంకర్ వరప్రసాద్ మృతదేహాన్ని సందర్శించిన సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

పొగాకు పండించి కొనేవారులేక అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న కౌలురైతు శివశంకర్ వరప్రసాద్ కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, రైతు కుటుంబానికి నివాస స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఏ ఆధారం లేని ఆ కుటుంబానికి స్వయం ఉపాధి కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి డిమాండ్ చేశారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) మార్చురీ వద్ద శివశంకర్ వరప్రసాద్ కుటుంబాన్ని సిపిఎం జిల్లా నాయకులు వై.కృష్ణకాంత్‌తో కలిసి వై.నేతాజీ ఆదివారం పరామర్శించారు. ఆత్మహత్యకుగల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేతాజి మాట్లాడుతూ ఎన్నో ఆశలతో పంట మీద వచ్చిన ఆదాయంతో స్థలం కొనుక్కోని ఇంటి నిర్మాణం చేసుకోవాలని అనుకున్నారన్నారని, ఎకరానికి రూ.20 వేలు చొప్పున 11 ఎకరాలు కౌలుకు తీసుకొని పొగాకు పంట వేశాడని

శివశంకర వరప్రసాద్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేతాజి

చెప్పారు. పెట్టుబడి కోసం బ్యాంకులు అప్పు ఇవ్వకపోవడంతో ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో అప్పు తీసుకున్నారన్నారు. అయితే పంట కొనేవారు లేక అప్పుల తీర్చే పరిస్థితి కనబడక పోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కౌలురైతు అత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించి వారి కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైసిపి నుంచి

మాజీ మేయర్ కావటి సస్పెన్షన్

మనోహర్ నాయుడు, మరో ఇద్దరు కార్పొరేటర్లపైనా వేటు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి నుంచి మాజీ మేయర్ కావటి మనోహర్ నాయుడును సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ అధినేత జగన్ నిర్ణయం తీసుకున్నారని పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేసింది. మేయర్ ఎన్నిక రోజున ఏప్రిల్ 28న జరిగిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి గైర్హాజరైన కార్పొరేటర్లు మర్రి అంజలి, యాట్ల రవికుమార్‌ను కూడా వైసిపి నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. మార్చి 15న మేయర్ పదవికి మనోహర్ 2లో

అమరావతి మహిళలపై జర్నలిస్తు కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పలుచోట్ల ఆందోళనలు చేశారు. ఇందులో భాగంగా కృష్ణంరాజుతోపాటు కొమ్మినేని శ్రీనివాసరావుపైనా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలర్లు, టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు.

వార్తలు లోపలి పేజీల్లో

ఇసుక గోతుల్లో పడి ఇద్దరు మృతి

అమరావతిలోని కృష్ణానదిలో దుర్ఘటన 2లో

మిర్చియార్డులో నేటి నుంచి క్రయ విక్రయాలు

రాజకీయ సంకల్పంతోనే పోలీస్ సంస్కరణలు సాధ్యం

విశ్రాంత అధికారి ఎ.బి.వెంకటేశ్వరరావు 8లో

మిర్చియార్డులో నేటి నుంచి క్రయ విక్రయాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వేసవి సెలవులు అనంతరం గుంటూరు మిర్చి యార్డులో సోమవారం నుంచి క్రయ విక్రయాలు ప్రారంభం కానున్నాయి. గతనెల 10 వ తేదీ నుంచి యార్డుకు వేసవి సెలవులు ప్రకటించారు. సెలవల షెడ్యూలు ముగియడంతో సోమవారం నుంచి యార్డు పనిచేస్తుందని యార్డు కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు. గత నెల వరకు మిర్చికి తగిన ధరలు లేక ఎక్కువ మంది రైతులు నష్టపోయారు. ప్రస్తుతం జిల్లాలోని 130 కోల్డ్ స్టోరేజీల్లో దాదాపు 70 లక్షల మిర్చి బస్తాలు నిల్వలు ఉన్నాయని తెలిసింది. ఇక మీదట గ్రామాల నుంచి వచ్చే సరుకు కంటే కోల్డ్ స్టోరేజీ నుంచి వచ్చే సరుకు ఎక్కువగా ఉంటుందని వ్యాపార వర్గాలు తెలిపాయి.

మాజీ మేయర్ కావటి సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

నాయుడు రాజీనామా చేశారు. పార్టీ అధిష్టానానికి సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా రాజీనామా చేయడాన్ని అధిష్టానం తప్పుపట్టింది. మనోహర్‌నాయుడు రాజీనామా చేయడం ద్వారా టిడిపికి సునాయసనంగా మేయర్ పదవి దక్కిందని వైసిపి సీనియర్ నేతలు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు దాదాపు రెండు మూడు నెలల పాటు ఈ అంశంపై అధ్యయనం చేసిన అధిష్టానం వైసిపికి మనోహర్ నాయుడు వల్ల నష్టం జరిగిందని భావించి పార్టీ నుంచి సస్పెండ్ చేశారని పార్టీ వర్గాలు తెలిపాయి.

గుంటూరు కార్పొరేషన్‌లో మొత్తం 56 మంది కార్పొరేటర్లు ఉండగా వైసిపి నుంచి 45, టిడిపి నుంచి 9, జనసేన నుంచి ఇద్దరు గెలుపొందారు. గత మార్చి 18 తేదీ నాటికి టిడిపి కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాసం ప్రతిపాదించాలన్నా తగిన బలం లేదు. అప్పటికి వైసిపికి 27 మంది, టిడిపి కూటమికి 29 మంది కార్పొరేటర్లు ఉన్నారు. అవిశ్వాసం ప్రతిపాదించాలంటే కోరం ఉండాలి. కోరం అంటే మొత్తం 46 మంది హాజరు కావాల్సి ఉంటుంది. టిడిపికి ఉన్న బలం 34 కావడంతో అవిశ్వాసం పెట్టేందుకు టిడిపికి అవకాశం లేదని వైసిపి నాయకులు చెబుతూ వచ్చారు. కానీ ఆకస్మికంగా మేయర్ రాజీనామా వల్ల టిడిపికి మేలు జరిగింది.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - విజయవాడ

పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్‌లకు, చెడునడత కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రామాలలో పాల్గొనకూడదని అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఉంటుందన్నారు.

ఇసుక గోతుల్లో పడి ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - అమరావతి

కృష్ణానదిలో మునిగిని ఇద్దరు యువకులు దుర్మరణం పాలైన ఘటన ఆదివారం జరిగింది. సిఐ అచ్చయ్య వివరాల ప్రకారం.. గుంటూరు నగరానికి చెందిన ఒక కుటుంబంఆదివారం ఉదయం అమరావతికి ఆటోలో వచ్చింది. వీరిలో ఖాదర్ వలీ(20), కాజా (15) స్థానిక దేవస్థానం ఎదురుగా ఉన్న కృష్ణానదిలో ఈతకు దిగారు. నదిలో ఇసుక కోసం తవ్విన గుంతలు ఉండడంతో వాటిని గమనించలేక కొద్దిసేపటికి ఆ గుంతల్లో చిక్కుకున్నారు. మునిగిపోతున్నామని పెద్దగా అరుస్తుండగా పక్కనున్న వారు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఇద్దరూ గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చేపట్టారు. ప్రమాదం సుమారుగా మధ్యాహ్నం 12 గంటలకు జరగగా రెండు గంటల తర్వాత ఒకరి మృతదేహం, సాయంత్రం 6 గంటలప్పుడు మరొకరి మృతదేహాన్ని పోలీసులు వెలికి తీశారు. కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువకుల మృతి సమాచారం తెలుసుకున్న బంధువులు గుంటూరు నుండి అమరావతి ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రి వద్ద విషాధ వాతావరణం నెలకొంది.

మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

చదువుకు దూరం-పనుల్లో బాల్యం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వాహకులు, కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు. ఏటా కార్మిక శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి బాలలను గుర్తించి వారిని చదువుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెబుతున్నా ఆచరణలో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ ఉండటం లేదు.

2019 నుంచి 2025 వరకు జిల్లాలో ఇప్పటి వరకు కార్మిక శాఖ వివిధ శాఖల అధికారుల సహకారంతో చేపట్టిన తనిఖీల్లో 272 కేసులు నమోదు చేశారు. అయితే తనిఖీల్లో గుర్తించిన బాలల సంక్షేమాన్ని సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదని, వారికి పూర్తి స్థాయిలో విద్య,వైద్యం, వారి కుటుంబానికి అవసరమైన చేయూత ఇవ్వడం లేదనే విమర్శలున్నాయి. బాల కార్మికులను పనుల్లో పెట్టుకోకూడదని తెలిసినా కొంత మంది తక్కువ వేతనం ప్రాతిపదికన వినియోగిస్తున్నారు. వీరితో పాటు కౌమార దశలో ఉన్న వారిని కూడా పనుల్లో పెట్టుకోకూడదని నిబంధనలు ఉన్నాయి. ఇందుకోసం కొంత మంది సంబంధిత బాలల ఆధార్ కార్డుల్లో వయస్సును కూడా మారుస్తున్నారని తెలిసింది. పాఠశాల విద్యలో మార్పులు చేయడం, గత ప్రభుత్వ హయంలో కొన్ని పాఠశాలలు మూసివేయడం వల్ల కూడా పల్నాడు జిల్లాల్లో కొంత మంది చదువుకు దూరమై బాలకార్మికులుగా మారారని తెలుస్తోంది.

ప్రజలు సమాచారం ఇవ్వాలి : కార్మికశాఖ ఉప కమిషనర్ గాయత్రీ దేవి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 18 ఏళ్లలోపు బాల కార్మికులు ఎవరైనా పనుల్లో ఉంటే వెంటనే తెలియజేయాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎ.గాయత్రీదేవి కోరారు. దుకాణాలు, సినిమా థియేటర్లు, పెట్రోలు బంకులు, వాణిజ్యసంస్థలు, ఇండ్లల్లో, పరిశ్రమలు, కర్మాగారాల్లో పనిచేస్తున్న పిల్లల వివరాలను ప్రజలు కార్మిక శాఖ అధికారులకు తెలియజేయాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సంబంధిత సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్మిక శాఖ అధికారులు ఫోన్లు నెంబర్లుకు 9492555157, 9492555144కు ఫోన్ చేసి వివరాలు చెప్పవచ్చని తెలిపారు.

న్యాయవాదుల సమస్యలపై పోరాటం

ప్రజాశకి- విజయవాడ

న్యాయవాదుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామని న్యాయవాదులన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాక్టీసింగ్ అడ్వకేట్ సొసైటీ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులుగా బొలిశెట్టి గౌరీ మణి (పిఠాపురం) జనరల్ సెక్రటరీగా కనిశెట్టి వెంకట రంగారావు (విజయవాడ)గా ఆదివారం నియమితులయ్యారు. ఎపి ప్రాక్టిసింగ్ అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గం ఏర్పాటు సందర్భంగా గౌరీమణి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి న్యాయవాదులకు రావాల్సిన బెనిఫిట్స్ అన్ని రావడానికి ప్రయత్నిస్తానన్నారు. వెంకట రంగారావుగారు మాట్లాడుతూ నాన్ ప్రాక్టీస్ అడ్యుకేట్స్ వల్ల చాలా సమస్యలు ఎదురవుతున్నాయని దానివల్ల ప్రాక్టీసింగ్ చేసే అడ్వకేట్స్ వృత్తిని నమ్ముకునే న్యాయవాదులందరూ అన్యాయం అవుతున్నారని వారికి రావాల్సిన బెనిఫిట్స్ సగం పైగా నాన్ ప్రాక్టీస్ అడ్వకేట్స్‌కి వెళ్ళిపోతున్నాయని అన్నారు. 35 సంవత్సరాలు దాటిన న్యాయవాదులకి వెల్ఫేర్ లేదని దీనిపై బార్ కౌన్సిల్ వారు ఆలోచించాలని కోరారు. తక్షణమే 35 సంవత్సరాల్ని 50 సంవత్సరాలుగా పెంచి కట్టవలసిన ప్రీమియం ఎమౌంట్‌ని ఎవరికైనా సరే రూ.పదివేలుగా ఉంచాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా దిగువ వర్గాల్లో ఉన్న న్యాయవాదులకు ఉచితమైన ఇల్లు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ అనేది బార్ కౌన్సిలర్ వారు లేకుండా చేశారని దానిపై సమీక్షించాలని, సొసైటీ సభ్యులకు ఇన్సూరెన్స్ కంపెనీలతో మాట్లాడి ఇన్సూరెన్స్ కల్పించడానికి ప్రయత్నిస్తామన్నారు.

కార్యవర్గ సభ్యులుగా చోడవరం బార్ న్యాయవాది అదట్రావు వెంకట్రావు, రామచంద్రపురం బార్ న్యాయవాది చిన్నం వీరెడ్డి వైస్ ప్రెసిడెంట్ గానూ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విశాఖపట్నం బార్ న్యాయవాది చక్రవర్తి, సెక్రటరీలుగా పార్వతీపురం బార్ సభ్యుడు కె.నవీన్, సోంపేట బార్ సభ్యుడు బమ్మిడి రాజశేఖర్, జాయింట్ సెక్రటరీలుగా తుని బార్ సభ్యుడు సూర్య ప్రకాష్, వేణు గోపాల్, ట్రెజరర్‌గా గొర్లె అప్పారావు, మెంబర్లుగా నందిగామ బార్ న్యాయవాది యరగొర్ల రామారావు, బెజవాడ బార్ సభ్యులు వరహాలక్ష్మి, ముద్దాడ సత్యనారాయణ, ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రంగారావు తెలిపారు. ఆ తరువాత జరిగిన కార్యవర్గ సమావేశంలో పూర్వపు కృష్ణా జిల్లా, ప్రస్తుత ఎన్‌టిఆర్ జిల్లా ప్రాక్టిసింగ్ అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్‌గా నందిగామ బార్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబును నియమించినట్లు రంగారావు తెలిపారు.

శాతవాహన పరిరక్షణ కమిటీ ఏర్పాటు

నినాదాలు చేస్తున్న శాతవాహన పరిరక్షణ కమిటీ

ప్రజాశక్తి - విజయవాడ

శాతవాహన కళాశాల మైదానం కబ్జాకు గురవడం భవనాలు కూల్చివేత వంటి విషయాలు అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో కళాశాలను కాపాడుకోవాలని కోరుతూ కళాశాల పూర్వ విద్యార్థులు పూర్వ సిబ్బంది ఉద్యోగ ఉపాధ్యాయులు అందరూ కలిసి శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీగా ఏర్పడ్డారు. ఆదివారం పూర్వ విద్యార్థులు ఆక్రమిత ప్రాంతం పరిశీలించారు. ఆక్రమణదారులపైన కూల్చివేతకు కారణమైన వారిపైన తగిన చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. అనంతరం ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి కమిటీగా ఏర్పడ్డారు. కన్వీనర్‌గా కళాశాల పూర్వ ప్రధాన అధ్యాపకులుగా ప్రస్తుతం దుర్గా మల్లేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షులుగా ఉన్న వి.సాంబిరెడ్డి, కో కన్వీనర్‌గా పూర్వ విద్యార్థులు ఎమ్.విష్ణువర్ధన్, నవనీతం సాంబశివరావు ప్రచార కమిటీ కన్వీనర్‌గా మోతుకూరి అరుణ కుమార్, కమిటీ సభ్యులుగా కందిరి వెంకటేశ్వరరావు చుండూరు నరేంద్ర, వి.శ్రీనివాసరావు, వల్లూరు నాగబాబు, వేదాంతం కిరణ్, మల్లంపల్లి సురేష్ ఉన్నారు. అందరినీ కలుపుకుని త్వరలో భవిష్యత్తు కార్యాచరణతో ముందుకు వెళ్లనున్నట్లు పైఅధికారులను కలుస్తామని సాంబిరెడ్డి తెలిపారు.

టిడ్కో గృహ సముదాయాల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

పాలకులు మారుతున్నారే గాని పేదల చిరకాల స్వప్నం నెరవేరడం లేదని సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు మండిపడ్డారు. ఆదివారం నగర శివారులోని జక్కంపూడి ప్రాంతంలో నిర్మించిన టిడ్కో గృహ సముదయాలను సిపిఎం బృందంతో కలిసి సత్యబాబు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2017లో నిర్మాణం చేపట్టిన టిడ్కో గృహాలను పోదేందుందుకు అర్హులైన లబ్ధిదారులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రభుత్వానికి డీడీలు కట్టి ఏడేళ్లు గడిచాయని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వాలు మారుతున్నాయే గాని నేటికీ పేదలకు పక్కా ఇల్లు ఇవ్వలేదని ధ్వజ మొత్తారు. పేదలకు గృహాలు మంజూరు చేయకుండా ఇంకెంతకాలం మోసగిస్తారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన ప్రశ్నించారు. 12,000 మంది లబ్ధిదారులు టిడ్కో ఇళ్ల కోసం డిడీలు చెల్లిస్తే సగం మందికి కోత వేయడం గత ప్రభుత్వం చేసిన తప్పిదమన్నారు. ఈ అన్యాయాన్ని ఈ కూటమి ప్రభుత్వం సరిదిద్దాలని కోరారు. ఫిబ్రవరి 2025లో జరిగిన విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో సిపిఎం పక్షాన టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు ఎప్పటికీ అందిస్తారని వేసిన ప్రశ్నకు సమాధానంగా 2025 మే నాటికి సుమారుగా 2,250 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారని వెల్లడించారు. ఈ 13న జరగబోవు నగరపాలక సర్వసభ్య కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాలను పాలకుల దృష్టికి తీసుకువెళ్ళి ప్రశ్నిస్తామని తెలిపారు. లబ్ధిదారులను ఐక్యం చేసి త్వరలో టిడ్కో ఇళ్ల గృహప్రవేశాలకు కదిలివస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇవి నారాయణ, నగర కమిటీ సభ్యులు ఎస్.సుబ్బారెడ్డి, ఎండి మస్తాన్, వి.శ్రీను, టిడ్కో ఇళ్ల బాధితులు దుర్గారావు, రవణమ్మ, లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన చందామీరావలి

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నకరికల్లు

అతిగా మద్యం సేవించిన వ్యక్తి మృతి చెందిన సంఘటన నకరికల్లు వైన్ షాప్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపల్లి గ్రామానికి చెందిన చందామీరావలి (38). కుటుంబంలోని మనస్పర్ధల నేపథ్యంలో గత రాత్రి నుండి మద్యం సేవిస్తున్నాడు. వైన్ షాపులో నోరు ఎండిపోయి అపస్మారక స్థితికి చేరుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

సంఘటనా స్థలంలో మృతి చెందిన వీరాంజనేయులు

ప్రమాదంలో గాయపడిన డేవిడ్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి - ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని చిలువూరు కంఠం రాజు కొండూరు గ్రామాల మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మరణించగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం ఆదివారం కంఠంరాజు కొండూరు గ్రామ శివారులో ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి గుడికి సుదూర ప్రాంతాల నుండి భక్తులు వస్తారు. ఈ క్రమం లో గుంటూరు, విజయవాడ నుండి వచ్చిన భక్తుల ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. గుంటూరు నుండి వచ్చిన వారిలో ఒకరు కొల్లూరు వీరాంజ నేయులు (40) అక్కడికక్కడే మరణించారు. ఇతను అమర్తలూరు మండలం ప్యాపరు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అదే వాహనంపై ఉన్న రాయపూడి డెబిట్‌కు గాయాలయ్యాయి. ఆయన గుంటూరు సమీపంలోని ఇంజనం పాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. వీరు గుంటూరులోని సంగడి గుంటలో కరెంటు పని చేసే వర్కర్లు. మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్‌కు, గాయపడిన డేవిడ్ ను వైద్యం నిమిత్తం దుగ్గిరాల 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాల కు తరలించారు. విజయవాడ నుండి వచ్చిన వారికి కూడా గాయాలయ్యాయి. వీరిరువురిని మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు .వారి వివరాలు తెలియాల్సి ఉంది.దుగ్గిరాల పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఎండలు మంట.. ఫీజులు మోత

'తల్లికి వందనం' కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి- తాడేపల్లి

జూన్ నెల వచ్చిందంటేనే.. పిల్లలు.. పాఠశాలలు.. ఫీజులు గుర్తుకు వస్తాయి. ఒక వైపు రోహిణి కార్తెలు రోళ్ళ పగిలే ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు అంటే స్థాయిలో ఫీజులు ఫీవర్ పిల్లల తల్లిదండ్రులను హై టెంపరేచర్కు గురిచేస్తుంది. వేసవి సెలవులు మరో వారం రోజులకు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. ఇప్పుడిప్పుడే అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలు దగ్గరకు వెళ్లిన చిన్నారులందరు తమ సొంత ఇళ్లకు చేరుకుంటున్నారు. కొన్ని పాఠశాలలో ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. మా పాఠశాలలో చేర్చండి.. మా పాఠశాలలో అయితేనే ఉత్తమ క్రమశిక్షణ.. మంచి మార్కులతో ఉత్తీర్ణత.. ఐఐటి లాంటి కోచింగ్ మాకే సొంతం ఎలాంటి ప్రకటనలతో తాడేపల్లి పట్టణంలో మైకుల ద్వారా వీధి వీధిన ప్రచారం హోరెత్తిస్తున్నారు. కొన్ని పాఠశాలలు అయితే కొంతమందిని ప్రత్యేకంగా నియమించి ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ మా పాఠశాలలోనే మీ విద్యార్థి భవిష్యత్తు బాగుంటుందని చెప్తున్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలో నూతన సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. తాడేపల్లి పట్టణం, రూరల్ గ్రామాల్లో సుమారు 45 ప్రభుత్వ పాఠశాలలు, 30 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు40 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పుస్తకాలు, యూనిఫామ్ కూడా తల్లిదండ్రులకు ఇబ్బంది లేకుండా పాఠశాలలో తామే అందిస్తామని యాజమాన్యాలు ముందుకు వస్తున్నాయి. తాడేపల్లి పట్టణం గతంలో లాగా లేదు. కార్పొరేట్ అంగులన్నీ వచ్చి పడ్డాయి. ఫలితంగా నర్సరీ నుండి మొదలయ్యే విద్యార్థి దశ కు రూ25 వేల నుండి 50 వేల రూపాయల వరకు ఫీజులు చేస్తున్నారు. పై క్లాస్ కి వెళ్తే రూ లక్ష వరకు ఫీజుల మోత మోగిపోతుంది. ఇంటర్, ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు అయితే పది లక్షల నుండి 15 లక్షల వరకు వెచ్చించాల్సి వస్తుంది. ఆర్థికంగా డబ్బు ఉన్నోళ్లకు ఇది పెద్ద సమస్య కాకపోవచ్చు. కానీ సామాన్య మధ్యతరగతి ప్రజలకు ఇది మోయలేనంత భారం, ఫీజుల నియంత్రణ అంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని పేదలు పెదవి విరుస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన తల్లికి వందనం (అమ్మఒడి) పథకం ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. గత సంవత్సరం ఈ సమయానికి వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తాము అధికారంలోకి వస్తే కుటుంబంలో ఎంతమంది చదివితే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని కూటమినేతలు హామీ ఇచ్చారు. అంతకుముందు ప్రభుత్వం అమ్మ ఒడి పేరుతో ఇంట్లో ఎంత మంది చదివిన పదిహేను వేల రూపాయలు తల్లుల ఖాతాలో జమ చేశారు. గత సంవత్సరం కూటం ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు జరపలేదు. ఈ సంవత్సరం అమలు జరుపుతామని ఇటీవల ముఖ్యమంత్రి ప్రకటించారు. తల్లికి వందనం పథకం ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులకైనా? ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా వర్తిస్తుందా? అనేది ఇంకా స్పష్టత లేదు. గత ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థులకు అమ్మఒడి పేరుతో నగదు జమ చేశారు. మరో నాలుగు రోజుల్లో బడులు తెలుసుకోబోతున్నాయి. తల్లికి వందనం పథకం చెప్పిన ప్రకారం అమలు జరిపితే సామాన్య మధ్యతరగతి విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు కొంత ఊరట కలుగుతుంది.

కేశ ఖండన శాల, దుకాణాలు పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధికి వచ్చే యాత్రికులు తిరిగి వెళ్ళేటప్పుడు వ్యక్తం చేసే సంతృప్తి సిబ్బంది పనితీరుకు కొలమానం అని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్ అన్నారు. ఆదివారం దుర్గాఘాట్ నుండి ఇఒ కాలినడకన అన్ని దుకాణాలు, కౌంటర్లు, కేశ ఖండన శాల, టికెట్ కౌంటర్లు పరిశీలించారు. అనంతరం అమ్మవారి పాత మెట్లు గుండా కొండ మీదకు చేరి శివాలయానికి వెళ్లి అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ క్రమంలో దుర్గాఘాట్‌లో హాకర్లు ఎంతమంది? స్థల విస్తీర్ణం ఏ ప్రాతిపదికన కేటాయించారని దేవస్థాన ఇఒ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. యాత్రికులకు నడిచే దారికూడా లేకుండా దుకాణాలు విస్తరిస్తే చేస్తున్నారని అక్కడి ఆలయ సిబ్బందిని ప్రశ్నించారు. అమ్మవారి దర్శనం, ప్రసాదం కన్నా ముందు భక్తులు ప్రాధాన్యత ఇచ్చే కేశ ఖండనశాలలో ప్రశాంతంగా తలనీలాలు సమర్పణ, దుర్గాఘాట్‌లో పవిత్ర వాతావరణంలో నదీస్నానం ఆచరించిస్తే భక్తులు పాజిటివ్ ఎనర్జీతో ఇంద్రకీలాద్రికి చేరుకొని జగన్మాతను సంతృప్తిగా దర్శనం చేసుకుంటారన్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానానికి విచ్చేసిన భక్తజనం సంతృప్తిగా తిరిగి వెళ్ళడానికి ఆలయ ఉద్యోగులు అందించే సేవలు కొలమానంగా నిలుస్తాయని ఇఒ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా దాదాపు 10శాతం యాత్రికులతో ప్రతి రోజు మాట్లాడి, అభిప్రాయం తెలుసుకుంటుంటే, ఇక్కడ పరిస్థితి తేటతెల్లం అవుతుందని, ప్రతీ ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ఉద్యోగులు కార్యాలయంలో కాకుండా 85 శాతం సమయం యాత్రికుల మధ్యన ఉండి, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా, ధార్మికంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు పాటించాలని సూచించారు. ఈ క్రమంలోనే తాను కూడా ఆలయ ప్రాంగణంలో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. దుకాణదారులనుండి యాత్రికులకు ఎదురవుతున్న సమస్యలతో పాటు, పారిశుధ్యం, ట్రాఫిక్ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ పర్యటనలో దేవస్థానం పారిశుధ్య, ఇంజినీరింగ్ అధికారులు, వన్‌టౌన్ సిఐ గురు ప్రకాష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి భానోదయ

చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్టు
22 వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 22 వాహనా లను స్వాధీనం చేసుకున్నట్టు గుంటూరు సౌత్ డిఎస్‌పి జి.భానోదయ తెలిపారు. ఆదివారం నల్లపాడు పోలీసు స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. గోరంట్లకు చెందిన పరిమిశెట్టి లక్ష్మణ్, పాత గుంటూరుకు చెందిన చల్లా అంజిబాబు గత కొంత కాలంగా గుంటూరులోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో వాహనాలను దొంగిలిస్తున్నారు. నల్లపాడు పోలీసు స్టేషన్‌పరిధిలో 10, అరండల్‌పేటలో మూడు, పట్టాభిపురంలో రెండు, కొత్తపేటలో రెండు, లాలా పేటలో రెండు, పాత గుంటూరులో రెండు వాహనాలను దొంగిలించినట్టు నిందితులు విచారణలో అంగీకరించారని తెలి పారు. చెడు వ్యసనాలకు అలవాటుపడి సునాయసనంగా సంపాదించవచ్చునన్న ఆశతో వాహనాలను దొంగిలించి ని డిఎస్‌పి తెలిపారు. నల్ల పాడు సిఐ వంశీధర్, ఎస్ఐ బి.జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి - విజయవాడ

దేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల మీద పోరాటాలకు ఐక్యంగా ముందుకు సాగాలని అందుకు ఆచార్య ఎన్ జి రంగా వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని రైతు ఉద్యమ నాయకులు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు సూచించారు. ప్రముఖ రైతు నాయకులు ఎన్‌జి.రంగా 30వ వర్ధంతి సభ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జరిగింది. తొలుత రంగా విగ్రహానికి పూల దండలతో నివాళులర్పించారు. వడ్డే మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం కాలంలో రైతాంగం ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని, పార్లమెంట్ సభ్యునిగా సమర యోధుడుగా కీర్తి పొందారని, దేశ వ్యాపితంగా రైతు రక్షణ యాత్రలు చేసిన ఘనత ఉందని అన్నారు. ఆయన పేరునే వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉందని గుర్తు చేశారు. రైతు సమస్యలపై ఆయన స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. గోగినేని ధన శేఖర్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు కెవివి.ప్రసాద్, వై.కేశవరావు, మోతుకూరి వెంకటేశ్వరరావు, కొలనుకొండ శివాజీ, కోనేరు బసవేస్వరరావు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

మేజర్ల మరమ్మతుకు రూ 1.33 కోట్లు విడుదల

ప్రజాశక్తి - రెంటచింతల

మాచర్ల నియోజకవర్గానికి మేజర్ల మరమ్మతులకు రూ.2 కోట్లు కేటాయిస్తే అందులో రెంటచింతల మండలానికి రూ. 1.33 కోట్లు కేటాయించినట్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి తెలిపారు. ఆదివారం పాలువాయి జంక్షన్‌లో మేజర్ల మరమ్మతు పనులను ప్రారంభించిన అనంతరం విలేక రులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సాగునీటి కాలువలకు మరమ్మతు చేయకుండా బిల్లులు చేసుకొని ఎవరి వాటా వాళ్ళు పంచుకుని అన్నదాతలను నట్టేట ముంచారని ఆరో పించారు. కార్యక్రమంలో డిసి చైర్మన్ పోట్ల నరసింహారావు, మేజర్ చైర్మన్ బి.శ్రీనివాసరావు లింగపున్నారావు, మాజీ సర్పంచ్ సాంబయ్య, విజయలక్ష్మి, లచ్చిరెడ్డి, టిడిపి అధ్యక్షులు అబ్బిరెడ్డి, సుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

కప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

క్రీడా స్ఫూర్తితో ఆడాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని అరవపల్లి గ్రామంలో ఆదివారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌కు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు విచ్చేశారు ముందుగా ఎమ్మెల్యే అరవిందబాబు కాసేపు క్రికెట్ ఆడారు. అనంతరం క్రికెట్ విజేతలకు వారికీ కప్పును బహూక రించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో ఆడితే మాన సిక ఒత్తిడి జయించగలమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యంగా నవోదయం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

వెంకటరమణమ్మ

నాటుసారా రహిత గ్రామా లే లక్ష్యంగా నవోదయం కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు మాచర్ల ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ ఎన్. వెంకటరమణమ్మ తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ కె. మణికంఠ మాచర్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని వెల్దుర్తి, దుర్గి, మాచర్ల మండలాల్లోని నాటు సారాయి అనుమానిత ప్రాంతాలలో ఆకస్మికంగా తనిఖీలు చేసేందుకు ఈ నెల 20వ తేదీ వరకు షెడ్యూల్ ఇచ్చారన్నారు. షెడ్యూల్ ప్రకారం నవో దయం -2.0 కార్యక్రమంలో భాగంగా నాటు సారాయి తయా రు చేసే గ్రామాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం, జాయింట్ రైడ్స్ చేయడం, నాటు సారాయి కేసులలో ఉన్న ముద్దాయిల మీద నిఘా ఉంచడం, గ్రామస్తులు, గ్రామ అధికా రులతో సమన్వయం చేసుకుంటూ నాటు సారాయి నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాటు సారాయి తయారు చేసే గ్రామాల్లో నేరాల గురించి ఎవరికైనా సంబంధం ఉంటే అడాప్షన్ ఆఫీసర్స్ కానీ, మాచర్ల ఎక్సైజ్ స్టేషన్లో గాని సమాచారం ఇవ్వాలనీ, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సిఐ వెంకట రమణ తెలిపారు. మద్యం దుకాణాలు మీద నిఘా కోసం ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా సిబ్బందికి విధులు కేటాయించి పర్యవేక్షిస్తామన్నారు.

అమ్మో...జూన్ నెల

- మధ్యతరగతి తల్లిదండ్రులకు టెన్షన్, భయం
- డొనేషన్లు, టర్మ్ ఫీజులు, బ్యాగులు, పుస్తకాల భారం
- ప్రైవేటు బడుల్లో ఫీజుల మోత

ప్రజాశక్తి - నరసరావుపేట టౌన్

జూన్ నెల వచ్చిందంటే సామాన్యులకు దడ మొదలైనట్లే.! స్కూళ్ల ప్రారంభం నేపథ్యంలో ఫీజులు, పుస్త కాలు, యూనిఫాం, బ్యాగులు ఇతర సామగ్రి కొనుగోళ్లతో తల్లిదండ్రులకు చుక్కలు కనపడతాయి. అయితే నియంత్రణ అనేది లేకపోవడంతో ఈసారి స్పెషల్ ఎఫెక్ట్ అన్నట్లు ఫీజుల భారం రెట్టింపైంది. ఇటు ఇంటి అద్దెలు పెరిగాయి ఆపై నిత్యావసర ధరల పెరుగుదల, ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలతో దిక్కుతోచని పరిస్థితి పేద, మధ్య తరగతి వారిది.ఒక్కో కుటుంబానికి ఈ నెలలో ఫీజుల రూపంలో లక్షల ఖర్చు అవుతుంది. చాలీచాలని వేతనాలతో పైసా పైసా కూడబెట్టుకునే సామాన్యులు ఈ జూన్ నెల గడిచేదెలా అంటూ ఆందోళన చెందుతున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఖర్చుల గుబులు నెలకొంది.ఇన్ని రోజులు ఏదో ఒక విధంగా నెట్టు కొచ్చిన పేద, మధ్యతరగతి కుటుంబాలు జూన్ వచ్చిందంటేనే భయపడిపోతున్నారు. అమ్మో.. జూన్ అంటూ వణుకుతున్నారు.నెలరోజుల పాటు వేసవి సెలవుల్లో ఆటపాటలతో ఆనందంగా గడిపిన విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతుండగా తల్లిడండ్రులు మాత్రం ఆర్థిక ఇబ్బందులను అధిగమిం చేందుకు ఆలోచన చేస్తున్నారు. నెలవారీ జీతాలపైనే ఆధార పడ్డ మధ్యతరగతి కుటుంబాలు సతమతమవుతున్నాయి. ప్రతీ కుటుంబంపై జూన్‌లో రూ. 50 నుంచి లక్ష వరకు స్కూల్ ఖర్చులు ఉంటాయి. ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రైవేట్ దుకాణాలలో పుస్తకాల అమ్మకాలు మొదలు పెట్టారు. ఈ సారి పుస్తకాల ధరలు స్వల్పం గానే పెరిగినా, సామాన్యుడు కొనలేని పరిస్థితి ఉంది. జిల్లాలోని వ్యవసాయ కుటుంబాలు తమ పిల్లలకు ఉన్నత విద్యను అందించాలని ఆరాట పడుతున్నాయి. ఇందుకు ప్రైవేటు విద్యవైపు మొగ్గు చూపుతుండడంతో వారికి అయ్యే ఫీజుల ఖర్చు మోయలేని భారంగా మారుతోంది. ప్రైవేటు పాఠ శాలలు, కాలేజీలు వివిధ రకాల పేర్లతో ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. ఎల్ కేజీ నుంచి పదో తరగతి, ఇంటర్మీ డియెట్ వరకు టర్మ్ ఫీజులు, బస్సు రవాణా, ఇతరాలు కలిపితే రూ. 15 నుంచి 50 వేల వరకు ఖర్చు అవుతోంది. ఇంజనీరింగ్ కోర్సులకు ఫీజురీయింబర్స్మెంట్ మినహాయించినా కళా శాలల ఫీజులు ఇతర ఫీజులు లక్షల్లోనే ఉంటున్నాయి.మరోవైపు హాస్టల్ ఫీజులు అదనపు భారం. దీనికి తోడు ఈవెంట్స్ పేరుతో అదనపు ఖర్చు.పుస్తకాలతో పాటు బ్యాగులు,టిఫిన్ బాక్సుల రేట్లు మండి పోతున్నాయి. పైసాపైసా కూడబెట్టుకునే సామాన్యులు ఈ నెల గడిచేదెలా అంటూ ఆందోళన చెందుతున్నారు. అధిక ఫీజులు వసూలు చేసే విద్యా సంస్థలపై ప్రభుత్వం, విద్యా ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యాలయాలకు నిలయం పల్నాడు జిల్లా కేంద్రం

ఒక్లాండ్ పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే అరవిందబాబు

హనుమంతరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట విద్యాలయా లకు నిలయంగా మారాలని, నాణ్యతతో కూడిన విద్యను అందించేలా యాజమాన్యాలు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో ఒక్లాండ్ నూతన క్యాంపస్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఒక్లాండ్ స్కూల్ చైర్మన్ కె.హను మంతరావును, ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసరావుపేట పట్టణంలో ఒక్లాండ్ స్కూల్ స్థాపించిన అనతి కాలంలోనే మంచి గుర్తింపు పొందిందన్నారు. మెరు గైన విద్యతో పాటు దేశ సంస్కృతి సంప్రదాయాలు విద్యార్థులకు తెలిసేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కె.హనుమంతరావు మాట్లాడుతూ అనుభవం కలిగిన అధ్యాపకులచే ఒత్తిడి లేని విద్యా బోధనకు ఒక్లాండ్ కేరాఫ్ అన్నారు. తమ స్కూల్ స్థాపించిన దగ్గర నుండి 10 వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారని తెలిపారు.

విద్యలో వికసించిన యడ్లపాడు మండలం తారలు

'షైనింగ్ స్టార్' పురస్కారాలకు ఐదుగురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - యడ్లపాడు

షైనింగ్‌స్టార్ అవార్డుకు యడ్లపాడు మండల విద్యా ర్థులు ఐదుగురు ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. పదోతరగతిలో ప్రతిభను చాటిన యడ్లపాడు మండలానికి చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'షైనింగ్ స్టార్ అవార్డు'లకు ఎంపికయ్యారు. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సామాజికవర్గాల ప్రకారం ఎంపిక చేసి జాబితాను శనివారం సాయంత్రం మండల విద్యాశాఖకు అధికారికంగా అందజేశారు. ఈ అవార్డుకు ఎంపికైనవారిలో సెయింట్ ఆన్స్ స్కూల్ (యడ్లపాడు)కు చెందిన నర్రా దేవిశ్రీ, శ్రీశ్రీ రవిశంకర్ సేవామందిర్ ఆశ్రమ పాఠశాల (కొత్తపాలెం) విద్యార్థి షేక్ అఖిల్, జడ్పీ హైస్కూల్ (ఉన్నవ) విద్యార్థి ఖరీదు జయలక్ష్మీ, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్(యడ్లపాడు) విద్యార్థి అత్తోట శ్యాం ప్రసాద్ 569 మార్కులు, ఇదే పాఠశాల విద్యార్థి గర్నెపూడి వంశీకృష్ణ ఎంపికయ్యారు వీరికి జూన్ 9న నరసరావు పేటలోని భువనచంద్ర టౌన్‌హాల్లో జరుగనున్న ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు కింద ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున నగదు బహుమతి, జ్ఞాపిక, ధ్రువపత్రాలు అంద జేయ నున్నారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థులు, పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను యడ్లపాడు ఎంఈవోలు ఎం.నాగరత్నం, ఎం అరుణకుమారి, తహాశీల్దార్ జెట్టి విజయశ్రీ, ఎంపీడీవో వి హేమలతాదేవి అభినందించారు.

బసవ గ్యాస్ట్రో, లివర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రసన్న కుమార్

ప్రతి ఒక్కరూ సంప్రదాయ ఆహారం తీసుకోవడం వల సంపూర్ణ ఆరోగ్యం సొంతంచేసుకోవచ్చని ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వేమూరి ప్రసన్న కుమార్ అన్నారు. రొంపిచర్ల మండలం పరగటిచర్ల గ్రామంలో బసవ గ్యాస్ట్రో అండ్ లివర్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని గ్రామ టిడిపి నాయకులు కందుల బ్రహ్మయ్య, కందుల శ్రీనివాసరావు, కామినేని రంగారావు ప్రారంభించా రు. ఈ శిభిరంలో గ్రామానికి చెందిన 168 మందికి బిపి, షుగర్, జలుబు, దగ్గు, జ్వరం వంటి సాధారణ వ్యాధులతో పాటు ప్రధానంగా గ్యాస్ట్రో సంబంధించిన వ్యాధులకు రక్త , లివర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసన్నకుమార్ మాట్లా డుతూ గ్యాస్ ట్రబుల్‌తో ఇబ్బంది పడేవారు నిర్లక్ష్యం చేయ కుండా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. బసవ గ్యాస్ట్రో, లివర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగా హన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. గ్యాస్ ట్రబుల్ సమస్య అధిగమిస్తే అనేక వ్యాధులను అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఆదివారం నరసరావు పేట పట్టణంలోని డాక్టర్ వరబాబు హాస్పిటల్‌లో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం గ్రామ పెద్దలు డాక్టర్ ప్రసన్న కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్నకుమార్ తండ్రి వేమూరి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు గుడిపూడి నాగరాజు, ఓరుగంటి బ్రహ్మయ్య, కామినేని ప్రసాదు, కందుల కోటయ్య, కామినేని నరసిం హారావు పాల్గొన్నారు.

స్కూలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ప్లే స్కూల్ ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూరో కిడ్స్ ప్లే స్కూల్‌ను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కంబాల వెంకటేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు జనసేన నాయకులు టి.భావనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న రవిబాబు

ఉపాధి పనులను చూపండి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలోని బాబూ జగ్జీవన్ రావ్ కాలనీలోని ఉపాధి హామీ వేతనదారులకు వెంటనే జాతీ య గ్రామీణ ఉపాధి హామీ పనులను చూపించాలని వ్యవ సాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి రవిబాబు అన్నారు. ఆదివారం బాబు జగజీవన్ రావు కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ కార్యక్రమం లో భాగంగా ఇంటింటికి వెళ్లారు. ఉపాధి వేతనదారులు మాట్లాడుతూ మేము ఈ సంవత్సరం ఒక్కరోజు కూడా పనికి వెళ్లలేదన్నారు. క్షేత్ర సహాయకుడు పనికి రమ్మని అడిగినప్పుడు మిర్చి కోతల పనులు ముమ్మరంగా ఉండ టం వలన వెళ్లలేకపోయామని, తర్వాత పనులు అడిగితే లేవని చెప్పడంతో నెల రోజులుగా ఇంటి వద్దనే ఉంటు న్నామని తెలిపారు. పని చూపితే వెళ్తా మన్నారు. రవి బాబు మాట్లాడుతూ ఉపాధి హామీ వేతన దారులకు వారు అడిగినప్పుడు పని చూపించాల్సిన బాధ్యత ఉంటుంద న్నారు. అలా కాకుండా పనులు లేవని చెప్పటం సరికాదని వెంటనే పనులు చూపించాలని కోరారు. ఉపాధి హామీ జాబ్ కార్డు లేనివారికి జాబ్ కార్డులు ఇవ్వాలని కోరారు.

పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాల కోసం నేడు ధర్నా

ప్రజాశక్తి - పెదకాకాని

మండలంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుకుంటూ సోమవారం తాసిల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు ఆదివారం పిలుపునిచ్చారు మండలంలోని పలు కాలనీలలో ఆయన ప్రచార యాత్ర చేశారు ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి మండల సిపిఎం కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వ భూముల్లో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న వారికి పట్టాలిస్తామని గ్రామాల్లో ఉండే ప్రజలకు మూడు సెంట్లు పట్టణాల్లో ఉండే వారికి రెండు సెంట్లు చొప్పున ఇండ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల వాగ్దానాల్లో చేశారన్నారు అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న తమ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదన్నారు పెదకాకాని మండలంలోని సుందరయ్య కాలనీ ఎన్టీఆర్ కాలనీ స్వర్ణపురి కాలనీ ఎస్టీ కాలనీ జాన్ హాస్పర్ కాలనీ వడ్డెర కాలనీలలోని ప్రజలు 20 సంవత్సరాలుగా 2000 మందికి పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయని వెంటనే వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని లేకపోతే ఆందోళనలు ఉదఅతం చేస్తాను అన్నారు మండలంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 5000 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు లేవని వారికి వెంటనే పట్టాలు ఇచ్చి ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు వివాదాలు లేని భూములలో నివాసం ఉంటున్న పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు ఇళ్ల పట్టాల సమస్యలు పరిష్కారం కోసం సోమవారం తాసిల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజా రమేష్ రామచంద్రరావు బి.రమేష్ రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు

ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం

ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - మంగళగిరి

దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం జులై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మంగళగిరి ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్.ఎస్.చెంగయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ విస్తఅత సమావేశం జరిగింది. సమావేశంలో చెంగయ్య మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం జరిగిందని విమర్శించారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో ఎయిమ్స్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రాష్ట్రంలో మోడీ ప్రభుత్వ విధానాలను బలపరుస్తూ కూటమి ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు మారుస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 21 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. కార్యదర్శిగా ఎం.బాలాజీ, అధ్యక్షులుగా కె.పరమేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.బుజ్జిబాబు, ఉపాధ్యక్షులుగా కె.వి.ఎస్. కిరణ్, ఆర్.నాగేశ్వరావు, పి.జ్యోతి, కోశాధికారిగా గాలి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా ఎ.రవికుమార్, డి.మనోజ్ బాబు ఎన్నికయ్యారు.

వెంకటేశ్వర్లుకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం కార్యకర్త మృతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని ఖాజా గ్రామంలో సిపిఎం సీనియర్ కార్యకర్త కాట్రగడ్డ వెంకటేశ్వర్లు (75) శనివారం రాత్రి మఅతిచెందారు. ఆయన మఅతి కి పలువురు నివాళులు అర్పించారు. ఆయనకు భార్య, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న వయసు నుండి పార్టీ అభిమానిగా ఉంటూ పార్టీ నిర్మాణానికి ఎంతో కఅషిని అందించారు. పూర్వం నుండి అనేక సంఘాలలో ఆయన పని చేశారు. దాదాపు 60 ఏళ్ల పాటు సిపిఎం పార్టీలో సానుభూతిపరిణిగా కార్యకర్తగా పనిచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి. కోటేశ్వరి, ఈదా ప్రతాపరెడ్డి, సాంబి రెడ్డి, తమ్మా ప్రసాదరెడ్డి, ఈదా బ్రహ్మ రెడ్డి, డి. నరసింహారావు, ఎస్. సుమ, చెన్నం కుమార స్వామి, అప్పికట్ల ప్రకాషరావు, అప్పికట్ల భాస్కరరావు, సింహాద్రి లక్ష్మా రెడ్డి, కారుమూరు మాధవరెడ్డి, ఆర్ధల పున్నయ్య, కారుమూరు గోపాలరెడ్డి, గాదె మాధవరెడ్డి, ఎస్ రామిరెడ్డి, గాదె రామారావు, ఆళ్ల సాంబి రెడ్డి, సింహాద్రి సామ్రాజ్యం, సత్యమారెడ్డి, పేరి రెడ్డి తదితరులు సిపిఎం జెండాను కప్పి నివాళులర్పించారు.

కార్పొరేట్లకు కట్టబెట్టడానికే మళ్లీ భూసమీకరణ

ప్రజాశక్తి - తాడేపల్లి

మతోన్మాదం, కార్పొరేట్ కలిసి ఊరేగుతున్న నేటి తరుణంలో దేశానికి కమ్యూనిస్టులు అవసరమెంతో ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు ఉద్ఘాటించారు. ఆదివారం రాత్రి తాడేపల్లి మేక అమరారెడ్డి భవన్‌లో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం వేముల దుర్గారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో బాబురావు మాట్లాడుతూ కమ్యూనిస్టులు లేని దేశాన్ని ఊహించగలమా అని ప్రశ్నించారు. మతోన్మా దా బిజెపి, ఆర్‌ఎస్ఎస్ దేశంలో దూకుడు పించన్ నేపథ్యంలో కమ్యూనిస్టులు అవసరం దేశానికి పెరిగిందని విశ్లేషించారు. శవాల మీద పేలాలు ఏరుకున్నట్లు అమెరికా యుద్ధోన్మాదాన్ని ప్రోత్సహిస్తుందని విమర్శించారు. దేశంలోని బిజెపి సామ్రాజ్య వాదానికి, పెట్టుబడిదారులకు లంగిపోయే స్వభావం కలదని చెప్పారు, దేశ స్వాతంత్ర పోరాటంలో కూడా బిజెపి అదే పాత్రని దుయ్య బట్టారు. ప్రపంచవ్యాప్తంగా మాంద్యం రాజ్యమేలుతుందని చెప్పారు. పెట్టుబడిదారీ విధానాల్లో దీని పరిష్కారం లభించడం లేదని విశ్లేషించారు. రాష్ట్రంలోని కూటం ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి నిర్మాణానికి గతంలో 53 వేల ఎకరాలు భూమి సేకరించిన ప్రభుత్వం, రైతులకు ఇంతవరకు ప్లాట్లు కేటాయించలేదని తెలిపారు. మరలా ఇప్పుడు 44 వేల ఎకరాలు భూమిని సమీకరించటం అంటే కార్పొరేట్లకు భూమి కట్టబెట్టటమేనని విమర్శించారు. జులై 9వ తేదీన జరిగే కార్మిక సమ్మె జయప్రదం చేయాలని కోరారు. ప్రజల్ని ఐక్యం చేస్తే సిపిఎం బలం పెరుగు తుందని, ఎక్కడికి అక్కడ ప్రజా సమస్యలు తీసుకొని పరిష్కారం అయ్యేంతవరకు కార్యకర్తల కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ తాడేపల్లి బైపాస్ రోడ్డు వాసులు మురుగుతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ప్రకటనలు మాని సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు మోపటాన్ని ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాబురావు

క్రీడలను ప్రోత్సహించటం అభినందనీయం

ప్రజాశక్తి- తాడేపల్లి

యువత యువకుల్లో ఉత్సాహాన్నిపెందుకు క్రీడలను ప్రోత్సహించటం అభినందనీయమని డిఎస్పి శాంతిరాజ్ చెప్పారు. క్రీడలు ద్వారా శరీర దారుఢ్యం పెరగటంతో పాటు యువతకు మంచి అవకాశాలు లభిస్తాయి అని విశ్లేషించారు. తాడేపల్లి పట్టణంలోని 8వ వార్డులోని బ్రహ్మానందపురం హైస్కూలులో 15 రోజులుగా జరుగుతున్న ఫ్యాక్టరీ ప్రిమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో డిఎస్పి శాంతిరాజ్ మాట్లాడారు. పోటీలలో గెలుపొందిన వారికి పార్ల మెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ సహకారంతో నగదు బహుమతులు అందజేశారు. తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, దాసరి ఉదయ్ శంకర్, దామర్ల ధనలక్ష్మి, దావిద్ సహకారంతో నగదు బహుమతులు అందజేశారు. విజేతలకు ట్రోఫీలను కొర్రపాటి విజయ్ సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి ఎస్ఐ ఎస్.కె ఖాజావలి, తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, కంచర్ల శివప్రసాద్ రావు, గండికోట నరసింహారావు, బెజ్జం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ దక్కేనా..!!

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అన్నదాత సుకీభవ పథకం క్రింద రైతులకి రూ. 20 వేలు పెట్టుబడి సాయం ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి అన్నారు. ఆదివారం రూరల్ గ్రామం గుడివాడలో కౌలు రైతులను కలిసిన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నదాత సుఖీభవ పథకాన్ని భూ యజమానులతో పాటు కౌలు రైతులకు కూడా ఇస్తామని ప్రకటించినట్లు తెలిపారు. గతేడాది ఇస్తానన్న హామీలను ఇప్పటికీ ప్రకటించక పోవడంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు. యజమాని సంతకంతో పనిలేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వాస్తవ సాగుదారుల పేరుతోనే ఈక్రాప్ నమోదు చేయాలని పేర్కొన్నారు. కౌలు రైతులు పంట రుణాలను రీ షెడ్యూల్ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలన్నారు. జూన్ 11న మంగళగిరి వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పణకు కౌలు రైతులు హాజరవ్వాలని ఆయన కోరారు. ప్రభుత్వం జన్నలు మొక్కజన్న కొనుగోలు కేంద్రాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం రైతులు కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన చెందారు. దీంతో దళారులు అదే తక్కువ ధరకు పంటను కొనుగోలు చేసి లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు ముద్దన సాంబశివరావు మాట్లాడుతూ మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్ నుండి సిసిఎల్ఎ వ్యవసాయ శాఖ కమిషనర్లకు వ్యక్తిగత అర్జీలతో వినతిపత్రాలు సమర్పించడం జరుగుతుందన్నారు. కౌలు రైతులందరూ తమ అర్జీలతో రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్, కర్రే మోషే, గొట్టిముక్కల ప్రేమయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులతో మాట్లాడుతున్న సాంబిరెడ్డి

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

187వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయస్థానాల తీర్పు ప్రకారం రావలసిన బకాయిల కోసం ఏ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 187 రోజుకు చేరుకున్నాయి. దీక్షలలో ఏం. గురవయ్య, దానయ్య, బి. నవనీతం, హిమాంబి, దుర్గాభవానిలు కూర్చున్నారు. దీక్షలను బి. సూర్య ప్రకాశరావు, యం. ఆశీర్వాదం, టీ. నాగేశ్వరావు, అరిఫ్ లు ప్రారంభించారూ. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కే. స్టీవెన్ మాట్లాడుతూ ఇప్పటికి 170 మంది చని పోయిన ప్రభుత్వంలో చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ బ్రతికున్న వారిలో చాలామంది అనారోగ్యం, కళ్ళు కనపడక, తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారని చెప్పారు. యాజమాన్యం ఇకనైనా కళ్ళుతెరవాలపి కోరారు. కార్మికులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎండాకాలం సెలవులు అనంతరం హైకోర్టులో ఉన్న కేసు కార్మికులకు సంపూర్ణ న్యాయం జరుగుతుంది అని ఆశాభావం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో పలువురు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు పాల్గొన్నారు.

సర్వేలతోనే కాలం గడిచిపోతోంది

పని వత్తిడికి గురవుతున్నామంటున్న అధికారులు, ఉద్యోగులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రకరకాల సర్వేలతో అధికారులు, ఉద్యోగులు పని ఒత్తిడితో కుంగిపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ అంశాలకు సంబంధించి 25 రకాల సర్వేలు జరుగుతున్నాయి. వాటిల్లో సహజంగా రెండు సర్వేలు అందరూ చేస్తారు. వాటిల్లో కుటుంభ కస్టర్ వారిగా మ్యాప్, మైగ్రేషన్ రోజువారీ సర్వేలు సహజంగా ఉంటాయి. మిగిలిన 23 సర్వేల్లో ఈ సర్వే పని అంటేనే అధికారులు, ఉద్యోగులు హడలెత్తిపోతున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాల మేరకు తాజాగా చేపట్టిన యోగాంధ్ర సర్వే దగ్గర నుంచి ఆస్తి పన్ను పెంపు రీ-సర్వే, బర్త్ సర్టిఫికెట్ సర్వే, హౌస్ హెూల్డ్స్ జియోట్యాగింగ్ సర్వే, ఇకె వైసి సర్వే, వర్క్ ఫ్రం హెూం సర్వే, స్కూల్స్ టాయిలెట్ ఫోటో ఎమ్మెస్ ఎంఇ సర్వే అదర్ డిపార్ట్మెంట్ ఈకే బిసి సర్వే మనమిత్ర కంపైనింగ్ సర్వే, డెత్ వెరిఫికేషన్, జి.ఐ.ఎస్ సర్వే, హౌస్ టు హౌస్ వెరిఫికేషన్ ఫర్ హౌస్ టాక్స్ సర్వే, ఆధార్ నెంబర్ సీలింగ్ టు వెహికల్ ఓనర్ సర్వే కుటుంబ సంక్షేమ సర్వే,ఫర్ హౌస్ టాక్స్ నిరుద్యోగుల గుర్తింపు, జాబ్రై ఇష్టం ఉందా లేదా వర్క్ ఫ్రమ్ హెూం సర్వే, పలానా డోర్ నెంబర్లో నివాసం ఉంటున్నాడా లేదా అనే దానికి హౌస్ హెూల్డ్ సర్వే, ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు ఎవరు, వారెంత మంది ఉన్నారు. ఎపిలోనే ఉన్నారా లేదా ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలకు వెళ్లారా అనే అంశాల ఆధారంగా చేపట్టిన సర్వే ఉద్యోగులకు ఊపిరాడ నీయడం లేదు. ఆధార్లో లేని పిల్లల నమోదు, 15-16 సంవత్సరాల యువతకు యోగా ఇష్టంగా ఉందా లేదా అనే అంశంపై సర్వే, ఇదే రీతిలో వెల్ఫేర్, పోలీసు ఇలా ప్రతి విభాగానికి సంబంధించిన సర్వేలు చేయాల్సి వస్తోందంటున్నారు. వేర్వేరు అంశాలకు సంబంధించిన 23 రకాల సర్వేలు చేయాలని ప్రభుత్వం పురమాయించిందంటున్నారు. ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో సర్వేలు చేయడమే తప్ప, ఎటువంటి ప్రయోజనం ఉండదని సర్వే నిర్వహిస్తున్న సిబ్బందే చెబుతున్నారు ధరల నియంత్రణ, పన్నుల భారం, నిరుద్యోగం, అభివృద్ధి పనులకు నిధులు లేక పోవటం, రేషన్ కార్డులు పెన్షన్లు వాటి పరిష్కారం దిశగా ప్రభుత్వం పని చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పట్టణంలో 38 వార్డులకు గాను మొత్తం 29 సచివాలయాలు ఉన్నాయి. అయితే అందులో అందరికి వేర్వేరు పనులు చెప్పటంతో రోజువారి పనులకు ఆటంకం కలుగుతోందని సంబంధిత ఉద్యోగులు వాపోతున్నారు.

రాష్ట్ర రాజధాని వేశ్యలకు నిలయమా?!

సైకోలకు వేదికగా జగన్ మీడియా సంస్థ

సీసీ రోడ్డుకు శంకుస్థాపనలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి ఆగ్రహం

ప్రజాశక్తి - మాచర్ల

పవిత్ర గౌతమ బుద్ధుని అవశేషాలను కలిగి, బౌద్ధం విలసిల్లిన రాష్ట్ర రాజధాని అమరావతిని వేశ్యల రాజధాని అంటారా? అని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మ నందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మాచర్ల పట్ట ణంలోని కిడ్స్ పాఠశాల వద్ద నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమా నికి ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా కిడ్స్ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీలో పరమ పుణ్యనేల, ప్రజా రాజాధాని అమరావతిని వేశ్యల నిలయం అని సంభోదించడం క్షమించరాని నేరమని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానిపై వేశ్య అని ముద్ర వేయడమంటే రాష్ట్ర మహిళలందర్నీ దూషించినట్లేనని, తప్పుడు విధానాలతో

మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

అవినీతి సొమ్ము తో స్థాపించిన జగన్ మీడియాలలో సైకోలు పైశాచికత్వంతో కన్నుమిన్ను కానకుండా డిబెట్లు పెట్టి, తెలుగు తల్లిని సైతం దూషిస్తున్నారని ఆరోపించారు.జగన్ మీడియా చానెల్పై ప్రభుత్వం చట్ట ప్రకారం చర్య తీసు కునేలా మాచర్ల నియోజకవర్గంలోని అన్నీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని శ్రేణులకు జూలకంటి పిలుపునిచ్చారు చానెల్లో డిబెట్ పెట్టిన జర్నలిస్ట్ కొమినేని, పాల్గొన్న కష్ణంరాజు ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గ్రీన్ మాచర్లకు సహకరించాలి

మాచర్ల పరిశరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనంతో పట్టణం విలసిల్లేలా అందరూ సహకరించాలని ఎమ్మెల్యే జూలకంటి కోరారు. పట్టణ నవీకరణకు, పచ్చదనానికి ప్రజలు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయాలకతీతంగా బాధ్యతగా వ్యవహరించినప్పుడే గ్రీన్ మాచర్ల సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాచర్ల చైర్మన్ మదార్ సాహెబ్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఎనుముల మురళీధర్‌రెడ్డి, తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతంలో ఉన్న మహిళలను దుర్భాషలాడటమే కాకుండా సమాజం సిగ్గుపడే రీతిలో మహిళలను కించపరుస్తూ అమరావతి వేశ్యలకు నిలయంగా ఉందనే వ్యాఖ్యలను చేస్తూ సాక్షి లైవ్ డిబేట్లో మాట్లాడిన కృష్ణంరాజును, దానిని సమర్థించిన కొమ్మినేని శ్రీనివాసరావును వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళ లను కించపరిచే వ్యాఖ్యలను ప్రోత్సాహించి ఛానల్లో టెలికాస్ట్ చేసిన సాక్షి టీవీ యాజమాన్యంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజధాని పనులు శరవేగం గా జరుగుతుం టే అది చూసి భరించలేక కేవలం జగన్‌ని సంతోష పెట్ట డానికి సాక్షి మీడియా అమరావతిపై అవమాన కర వ్యాఖ్యలు చేసిందన్నారు. గత వైసిపి పాలనలోనూ రాజధాని అమరావతి ప్రాంతంపై పూర్తిగా అసత్య ఆరోపణలు చేసి రాజధానిని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. వైసిపికి బుద్ధి చెప్పినా జగన్ రెడ్డి ఇంకా తన వైఖరి మార్చుకోకుండా రాజధాని గురించి మరో కొత్త కోణంలో జర్నలిస్ట్ కృష్ణంరాజు ద్వారా తన అక్కసును వెళ్లగక్కి, దానిని కొమ్మినేని శ్రీనివాస రావు ద్వారా టెలికాస్ట్ చేయించారని అన్నారు. కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీని వాసరావును ఇప్పటికీ వైసిపి ఖండించలేదంటే ఇది ఉద్దేశ పూర్వకంగా జగన్‌రెడ్డి చేయించిన వ్యాఖ్యలేనని స్పష్టమవుతోందని అన్నారు.

జగన్మోహన్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి : కొమ్మాలపాటి శ్రీధర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర రాజధానిపై దుష్ప్రచార దాడి చేయించినందుకు మహిళల శీలహననం చేయించినందుకు, అమరావతిలో అధికంగావున్న బీసీ, ఎస్సీలను అవమానించి నందు కు ప్రముఖ బౌద్ధ క్షేత్రంపై దాడి చేయించి నందుకు మాజీ ముఖ్యమంత్రి జగ న్మోహన్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొమ్మాలపాటి మాట్లాడుతూ ఆచార్య నాగార్జునుడు ప్రపం చ స్థాయి విశ్వ విద్యాలయం నిర్వహించిన ప్రాంతం అమరావతి-ప్రముఖ బౌద్ధ క్షేత్రం అమరా వతి- శాతవాహనుల రాజధాని అమరావతి అన్నారు. బడుగు, బలహీన వర్గాలు అధికంగా ఉన్న ప్రాంతమన్నారు. రాష్ట్ర ప్రజలకు, మహిళలకు, బడుగు బలహీన వర్గా లకు, ఆధ్యాత్మికవాదులకు క్షమాపణలు చెప్పాలన్నారు.ఆంధ్రుల కలల రాజధాని "అమరావతి"ని "వేశ్యల రాజధాని" అని సాక్షి డిబేట్లో మాట్లాడడం దుర్మార్గమన్నారు.

గురువులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రం ఈపూరు హైస్కూల్లో 2006-07 10వ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో వేర్వేరు ప్రాంతాలలో స్థిరపడిన వారందరూ ఒకచోటకు చేరి పాత జ్ఞాపకాలను పంచుకుంటూ ఆహ్లాదంగా గడిపారు. అనంతరం చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధిలో తమ వంతు సహకారం అందజేసా_ తమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జానకిలక్ష్మీదేవి, విజయభాస్కర్, ఉమాదేవి, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరాజు, డి.శివప్రసాద్, బి.భాస్కర్, కార్యక్రమం నిర్వాహకులు గంటా శ్రీనివాసరావు, రావూరి ప్రసన్న, వినుకొండ వెంకటేష్, నాగాంజనేయులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు గ్రామంలో మట్టి తోలకాన్ని ఆదివారం అడ్డుకున్నారు. గ్రామసెంటర్ లోని రోడ్డు పోరంబోకులో రోడ్డు నిర్మాణానికి మట్టి తోలు తున్నారు. దీన్ని దళిత కాలనీవాసులు అడ్డుకున్నారు. ప్రస్తు తం వున్న సిమెంట్ రోడ్డును మూసివేసేందుకే రోడ్డు నిర్మాణానికి మట్టి తోలుతున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. విష యం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఇరువర్గాలను చెదర గొట్టారు. రూరల్ సిఐ ఎంవీ సుబ్బారావు ఆధ్యర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సత్రశాలలో కృష్ణవేణి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - రెంటచింతల

వర్షాలు సమృద్ధిగా కురిసి పొలాల నిండా కృష్ణవేణమ్మ బిరబిరాపారి పాడిపంటలతో అన్నదాతల ఇంటసిరులు నిండాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం మండలంలోని కృష్ణా నది ఒడ్డున ఉన్న సత్రశాలలోనే కృష్ణవేణమ్మ విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ఆవిష్కరించారు. మొదట శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గుండా శివయ్య ప్రభు రాజు గొట్టం శ్రీనివాస్ రెడ్డి, నీలం మల్లయ్య ఈవో రామిరెడ్డి పాల్గొన్నారు.

షోరూం ప్రారంభంలో దొంతిరెడ్డి వేమరెడ్డి

రామ్‌రాజ్ కాటన్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన రామరాజు కాటన్ షోరూంను ఎంటిఎంసి వైసీపీ అధ్యక్షులు దొంతి రెడ్డి వేమరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రసిద్ధిగాంచిన రామ్ రాజ్ కాటన్ షోరూం తాడేపల్లిలో ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. ఇకనుండి విజయవాడ, గుంటూరు లాంటి నగరాలకు వెళ్లకుండా రామరాజు ఉత్పత్తులను తాడేపల్లిలోనే పొందవచ్చు అని చెప్పారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రామరాజు కాటన్ యాజమాన్యానికి వేమారెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో షోరూం నిర్వాహలతో పాటు వైసీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తారు ప్లాంటును బటన్ నొక్కి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పల్నాడు పారిశ్రామికంగా పురోగమించాలి

మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి- దుర్గి

పల్నాడు పారిశ్రామికంగా అభివృద్ధి చెందినప్పుడే యువతకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం దుర్గి మండలం ఆత్మకూరు శివారు ప్రాంతంలో ప్రముఖ కాంట్రాక్టర్ మారం ప్రసాద్ తారు ప్లాంట్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గం పరిశ్రమలు పెట్టడానికి అనుకూలమని అన్నారు. పరిశ్రమల స్థాపనకు యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్లాంట్‌కు సంబంధించిన మిషనరీలను ఆయన బటన్ నొక్కి ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదకూరపాడులో ఫిర్యాదు చేస్తున్న మహిళలు

కృష్ణంరాజు, కెఎస్ఆర్‌ను అరెస్టు చేయాలి

పలుచోట్ల పోలీసులకు ఫిర్యాదులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

అమరావతి మహిళలపై అసభ్యంగా మాట్లాడిన సాక్షి జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు కృష్ణంరాజును వెంటనే అరెస్టు చేయాలని తెలుగు మహిళా నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం వారు ర్యాలీ నిర్వహించి అనంతరం ఎస్ఐ గిరిబాబు కు ఫిర్యాదు చేశారు. భారతిరెడ్డి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పా లనీ, సాక్షిఛానల్ మూసివేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమం లో పఠాన్ నూర్జహాన్, షేక్ ముంతాజ్, కోంద్రు పద్మలత పాల్గొన్నారు.

వినుకొండలో

రాజధాని అమరావతి మహిళలను కించపరుస్తూ మాట్లా డిన వివిఆర్ కృష్ణంరాజు, తమ్మినేని శ్రీనివాసరావులను తక్ష ణమే అరెస్టు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వినుకొండ నియోజకవర్గం మహిళా సంఘం నాయకులు హెచ్చరించారు. ఆదివారం మహిళలు ప్లకార్డ్స్ చేత బూని నినాదాలతో వినుకొండ టౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. కృష్ణమరాజు, శ్రీనివాసరావును అరెస్ట్ చేయాలంటూ వినుకొండ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మహిళా సంఘం నాయకురాలు కౌన్సిలర్ షకీలా మాట్లాడుతూ వైసిపి పాలనలో రైతులు, మహిళా రైతులు మాన సిక క్షోభకు గురయ్యారని, కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధాని నిర్మాణ పనులు గాడిలో పడడంతో రైతులు సంతో షంగా ఉండడాన్ని భరించలేక ఉదేశ్యపూర్వకంగా మహిళలపై నీచంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు రాజధాని అమరావతిలో సెక్స్ వర్కర్లు ఎక్కువగా ఉన్నారని ఎన్జీవోలు చెప్పాయని అంటున్న కృష్ణమరాజు అవి ఎక్కడ ఉన్నా యో తెలపాలన్నారు. మహిళలను కించపరుస్తూ మాట్లాడిన కృష్ణం రాజును, యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేని శ్రీనివాస రావు ను, ప్రసారం చేసిన సాక్షి మీడియాపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాక్షి మీడియా యజ మాని వైయస్ భారతి వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వినుకొండ మహిళలు పాల్గొన్నారు.

అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయం

ప్రజాశక్తి - పెదకాకాని

అమరావతి మహిళలను వేశ్యలు అంటూ ఈనెల ఆరవ తేదీన సాక్షి టీవీలో జరిగిన ఒక కార్యక్రమంలో జర్నలిస్ట్ వి.వి.ఆర్.కృష్ణంరాజు పోల్చాడాన్ని తెలుగు మహిళలు, పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకఅష్ణ ఆధ్వర్యంలో ఆదివారం పెదకాకాని సీఐ టి.పి.నారాయణస్వామికి లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ అమరావతి మరియు పరిసర ప్రాంతాలలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఎక్కువ ఉన్నారని సుమారు 150 స్వచ్ఛంద సేవా సంస్థలు వారికోసం పనిచేస్తున్నాయని నోటికి హద్దు అదుపు లేకుండా కఅష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళలను దేవతగా కొలిచే భారతదేశంలో ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని వారిని ప్రోత్సహించిన కె.ఎస్.ఆర్. లైవ్‌షో నిర్వాహకుడు కొమ్మినేని శ్రీనివాసరావు ఇలాంటి జుగుప్సాకరమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్న సాక్షి టీవీ యజమానురాలు వైయస్ భారతిని కఠినమైన సెక్షన్లు పెట్టి శిక్షించాలన్నారు ఈ కార్యక్రమంలో ఎం.రుక్మిణి. బి.రాధ, కె.ధనలక్ష్మి, ఎ.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సిఐ నారాయణస్వామికి ఫిర్యాదిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

కించపరిచే వ్యాఖ్యలకు సిపిఎం ఖండన

రాష్ట్ర రాజధాని అమరావతిని, మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని సిపిఎం పెదకాకాని మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చరిత్రలో అమరావతికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, బౌద్ధ క్షేత్రం గాను ఒకప్పటి రాజ్య రాజధాని గాను అమరావతి ఉంది. బహుశా ఆ కారణంగానే ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాజధాని పేరును అమరావతిగా నిర్ణయించడాన్ని రాష్ట్రంలోనూ దేశంలోనూ అనేకమంది హర్షించారు. తదనంతరం గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని తరలింపు నిర్ణయం చేసినప్పుడు దానికి వ్యతిరేకంగా అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని కోరుతూ జరిగిన ఉద్యమంలో మహిళలు ప్రధానమైన భూమిక పోషించారు. ఇలాంటి నేపథ్యంలో ఒక టీవీ చర్చలో అమరావతిని వేశ్యల రాజధానిగా పేర్కొంటూ వ్యాఖ్యానించడాన్నీ సిపిఎం పార్టీ పెదకాకాని మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ఇది రాజధాని ప్రాంత ప్రజలను లేక మహిళలను అవమానించడం మాత్రమే కాక మొత్తం ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకాన్ని అవమానించడంగా భావించాల్సి వస్తున్నది. ఈ వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు

మాట్లాడుతున్న డాక్టర్ కె.వి.ఎన్.సాయిప్రసాద్

29న రత్నాల చెరువులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 29వ తేదీన మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువులో ఉచిత వైద్య శిబిరం ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లుగా ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం గోపాలకృష్ణ థియేటర్ వెనుక వైపు ఉన్న పిల్లల హాస్పిటల్లో ప్రజా ఆరోగ్య వేదిక మంగళగిరి రీజియన్ ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు నిర్ణయాలు చేసినట్లుగా తెలిపారు. పేద ప్రజలు నివాస ప్రాంతాలలో ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నెలకొకటి పెట్టాలని నిర్ణయించినట్లుగా తెలిపారు. 29వ తేదీన మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువులో అన్ని రంగాల వైద్యులు పాల్గొని ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజా ఆరోగ్య వేదిక మంగళగిరి రీజియన్ కార్యదర్శి ఎ.జయరాజు, ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు ఎస్.బాలకృష్ణ, వి.వి.ప్రసాద్, జేవీ రాఘవులు, ఎం రవి, పి.బాలకృష్ణ, బి.సుందర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేల శ్రావణ్‌కుమార్

12న టిడిపి విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో కోటను ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ నెల 12వ తేదీన గురువారం రాజధాని అమరావతిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ కుమార్ తెలిపారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో తాడికొండ నాయకుల సమావేశం జరిగింది. తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలమేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల 12వ తేదీన జరిగే భారీ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టిడిపి నాయకులు కంచర్ల శివరామయ్య, తలశిల ప్రసన్న కుమార్, గుంటుపల్లి మధుసూదనరావు, ఎడ్డురి హనుమంతరావు, గడ్డిపాటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి బండ్‌పై బొల్లిముంత విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన అభ్యుదయ కళా సమితి ఆధ్వర్యంలో స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆదివారం అభ్యుదయ సినీ రచయిత బొల్లి ముంత శివరామకృష్ణ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత బల్లిముంత చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమ్మేళనంలో పలువురు సాహితీ ప్రియులు పాల్గన్నారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ రంగిశెట్టి రమేష్ మాట్లాడుతూ సాహితీ రంగంలో తెనాలి ప్రాంత వాసిగా బొల్లిముంత శివరామకృష్ణ విశేష సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో కవి డాక్టర్ ఆళ్ళ నాగేశ్వరరావు, అభ్యుదయ కళాసమితి అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత యం. వి. రఘునాధరావు, కవి కె. విజయ సారధి బాబు, కళాకారులు వినుకొండ శ్రీరామమూర్తి, కన్నెగంటి మధు, కనపర్తి బెనహర్, చందు సూర్య తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న వక్తలు

క్యాన్సర్‌ను అవగాహనతోనే జయించాలి : డాక్టర్ మహతి

మాట్లాడుతున్న డాక్టర్ మహతి

ప్రజాశక్తి - గుంటూరు

ప్రస్తుతం చాలామంది ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలలో ప్రధానమైనది క్యాన్సర్ అని ఆంకాలజిస్ట్ డాక్టర్ టి.మహతి అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో క్యాన్సర్ వ్యాధిపై నిర్వహించిన ఆరోగ్యసభలో కిమ్స్‌చక్ర సెంటర్ కన్సల్టెంట్ ఆంకాలజిస్ట్ టి.మహతి మాట్లాడుతూ క్యాన్సర్ గురైన వారు తమ జీవితం ఇక ముగిసిపోయిందనే భావంతో కృంగిపోయి సమస్యను పెద్దది చేసుకొని ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. క్యాన్సర్ గుర్తించినప్పుడు అధైర్యపడకుండా వెంటనే వైద్యుని సంప్రదించి చికిత్స తీసుకుంటే సాధారణమైన జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. స్త్రీలలో మాత్రమే వచ్చే రొమ్ము క్యాన్సర్ గురించి మాట్లాడుతూ సెల్ఫ్ స్క్రీనింగ్ టెస్ట్ గురించి వైద్యుల వద్ద తెలుసుకొని చేసుకోవచ్చని, మామోగ్రామ్ ఎక్సరేల ద్వారా నిర్ధారణ చేసుకొని వైద్యం చేయించుకోవాలన్నారు. గర్భాశయం ముఖద్వార క్యాన్సర్ గురించి మాట్లాడుతూ ఈక్యాన్సర్ విషయంలో పాప్ స్మియర్ పరీక్ష ద్వారా నిర్ధారించుకొని తగు వైద్యం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పురుషులలో రక్తశాతం తగ్గినా, కిడ్నీ పరీక్షలో క్రియాటిన్ 1.1 కు మించినా అవి క్యాన్సర్ లక్షణాలు కావచ్చునని కావున వెంటనే డాక్టర్ ను సంప్రదించాలన్నారు. ఆరోగ్య సభకు టివి సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అనవేమా ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, వి.వి .రావు, శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.

ఆందోళనల కారణంగానే కులగణనకు ఆమోదం

ప్రజాశక్తి - తెనాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావును ఈనెల 15న పలు బీసీ సంఘాలు సత్కరించనున్నాయి. ఉదయం 10 గంటలకు స్థానిక రామకఅష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమం బ్రోచర్ ను వాకర్స్ సొసైటీ కార్యదర్శి జొన్నాదుల నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం ఆయా సంఘాల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకరరావు కుల గణన కోసం ఢిల్లీ జంతర్మంతర్ లో, అలాగే రాష్ట్రంలో పలుచోట్ల దశలవారి ఆందోళన చేసిన ఫలితంగానే కేంద్ర క్యాబినెట్ జనాభా లెక్కలతో పాటు కులగణనకు ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ నేపథ్యంలో బీసీ సంఘాలు ఆయనను సత్కరించనున్నాయని, అలాగే శంకర్రావు జీవిత విశేషాలతో కూడిన సావనీర్ ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, ఎస్ సవిత, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కటకం ప్రసాద్, షేక్ అబ్దుల్ హకీం జానీ, ఎ.వెంకటేశ్వరరావు, బి.నరసింహారావు, ఎ.సాంబశివరావు, ఎం.మల్లికార్జునరావు, సిహెచ్.సాంబశివరావు, ఎ.ఏడు కొండలు, ఇ.ఎల్.వి.అప్పారావు, పూర్ణచంద్రరావు, ఎస్.సతీష్ పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

డాక్టర్ రాకేష్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ బృందం

ఎముకల అరుగుదల సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - తెనాలి

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం స్థానిక అమరావతి కాలనీ ఎన్టీఆర్ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు గుమ్మడి నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్థోపెడిక్ (ఎముకల) డాక్టర్ టి.రాకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఎముకలు అరుగుదల వలన వచ్చు సమస్యలపై వారికి అవగాహన కల్పించారు. కీళ్ల అరుగుదలతో వచ్చే సమస్యలకి వైద్యులు సలహా మేరకు మందులు వాడాలన్నారు. బిపి, షుగర్, ఎక్కువ మందిలో ఉంటున్నాయని, అలా ఉన్నవారు ఎక్కువ శాతం నొప్పులకు వాడేటువంటి టాబ్లెట్లు, ప్రోటీన్లు డి విటమిన్లు ఉండే విధంగా వాడుకుంటూ వ్యాయము చేస్తే తగిన ఫలితం ఉంటుందని చెప్పారు. కీళ్ళకి సంబంధించి సర్జరీ చేయించుకునేవారు కొంత అవగాహనతో డాక్టర్ సూచనల మేరకు సర్జరీ అనంతరం ఫిజియోథెరపీ చేయటంతో ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్‌ను అసోసియేషన్ బృందం సత్కరించింది. కార్యక్రమంలో టి.రాకేష్, ఆలపాటి వెంకట రామయ్య, గుంటుపల్లి భాస్కరరావు, ఉన్నవ సూర్యనా రాయణ, పూఫూరి శివప్రసాద్, కె.రాజేంద్రప్రసాద్, వై.గాంధీ . ప్రసాద్, డి.సాయి బాబు, జి.రమేష్, బి .సాంబశివరావు, యు. వెంకటేశ్వరరావు, పి.రమేష్, సాకేటేశ్వరావు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నవీన హైస్కూల్ విద్యార్థిని అన్యూన్యకు షైనింగ్ స్టార్ అవార్డు

ప్రజాశక్తి - గుంటూరు


విద్యార్థిని అభినందిస్తున్న చిన్నపరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ షైనింగ్ స్టార్ అవార్డుకు స్థానిక నగరాలులోని నవీన విద్యా సంస్థలకు చెందిన, పదవ తరగతిలో 595 అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని కాకుమాను అన్యూన్య ఎంపిక అయ్యింది. ఈ సందర్భంగా కాకుమాను అన్యూన్యను నవీన విద్యాసంస్థల చైర్మన్ ఏరువ చిన్నపరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఏరువ నవీన్‌రెడ్డి అభినందించారు. సోమవారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మంది రంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగే షైనింగ్ స్టార్స్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో అన్యూన్యకు రూ.20వేల నగదుతో జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారులు అందిస్తారన్నారు.

వెటరన్ క్రీడాకారులకు ఘన సన్మానం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరులో ప్రముఖ యోగా నిపుణులు, క్రీడాకారులు పెండ్యాల జైహింద్ గురూజీ, సుబ్బాయమ్మ దంపతులకి స్థానిక ఎల్. వి.ఆర్. క్లబ్‌లో ఆదివారం రాయపాటి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ వీరిని శాలువా కప్పి సన్మానించారు. ఇటీవల ఇటీవల గోవాలో జరిగిన 12వ జాతీయ యోగా, క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన జైహింద్, సుబ్బాయమ్మలను డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు పలువురు అభినందించారు. స్థానిక కార్పొరేటర్ కామినేని కోటేశ్వరరావు, రాష్ట్ర ఆర్ఎంపీలు సంఘం అధ్యక్షులు డాక్టర్ రాజా సిద్ధార్థ, న్యాయవాది పార్థ సారథి తదితరులు పాల్గొన్నారు.

చెట్లు తొలగించిన చిత్రం

రోడ్డు విస్తరణకు చెట్ల తొలగింపు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కొడమోడు-పేరేచెర్ల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న భారీ చెట్లను జాతీయ రహదారి విస్తరణ సిబ్బంది తొలగిస్తున్నారు. కొండమోడు నుండి సత్తెనపల్లి మార్గంలో రహదారి విస్తరణకు అడంగా ఇరువైపులా ఉన్న భారీ చెట్లను అధునాతన యంత్రాలతో కట్ చేస్తున్నారు. రోడ్డు కు ఇరువైపులా నిడనిచ్చే పచ్చని చెట్లు నేలకు ఒరిగాయి. ఎంతో ఆహ్లాదకరంగా ఉన్న వృక్షాలను తొలగించటంతో రహదారి కళావిహీనంగా మారింది. వేసవిలో పాదచారులు, ప్రయాణికులు పసుపక్ష్యాదులు సేదతీరేందుకు ఉన్న చింత చెట్లు, వివిధ రకాల చెట్లు తొలగిస్తున్నారు. అసలే వేసవి కాలం ద్విచక్ర వాహనాల ఆటోలలో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు చెట్లు లేక పోవటంతో అవస్థలు పడుతున్నారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థి ప్రేమ్ సాగర్, ఎస్.డి.అర్షద్, ఉమేష్ నారాయణన్, విష్ణు కార్తీక్

ఈఏపీసెట్ ఫలితాల్లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఈఏపీసెట్ ఫలితాల్లో వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని విజ్ఞాన్ జూనియర్ కళాశాలల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన ఎం.ఉమేష్ నారాయణన్ 347, ఎస్.డి.ఆఅర్షద్ 565, వై. విష్ణు కార్తీక్ 613, ఎస్. ప్రేమ్ సాగర్ 635, ఎస్.కె. ఎమ్రోజ్ 736, వి.యశ్వంత్ మణికంఠ 883, ఎం. కవిత 2735, జీవీఏ. తేజస్వి 3008, విద్యాకళ 3415 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. 1000 లోపు ర్యాంకులు 6 మంది విద్యార్థులు, 5000 లోపు ర్యాంకులు 25 మంది విద్యార్థులు, 10000లోపు ర్యాంకులు 48 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. విజ్ఞాన్ జూనియర్ కళాశాల నుంచి ఈఏపీసెట్‌కు హాజరైన విద్యార్థులందరూ ర్యాంకులు సాధించారని తెలియజేశారు.ప్రతిభ చూపిన విద్యార్థులకు విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్స్ ఉపాధ్యక్షులు లావు శ్రీకఅష్ణదేవరాయలు, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ జె.మోహన్‌రావు, వై.వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిఎంసి కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, గ్రీవెన్స్

ప్రజాశక్తిగుంటూరు

జిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుండి 10:30 గంటల వరకు కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ (0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రజాఫిర్యాదుల కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరిస్తామన్నారు. కావున నగర ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు.

డెల్టాలో ముందస్తు సాగుకు అవకాశం

- రైతులను ఆ దిశగా చైతన్యపరుస్తాం
- పంటల మార్పిడి పాటించాలి
- వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వర్లు

డెల్టాలో ముందస్తు సాగుకు అవకాశం ఉందని, ఈదిశగా రైతులను చైతన్యపరుస్తున్నామని వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. రైతులు పంటమార్పిడి పాటించాలని కోరారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సూచనలు?

రైతులు పంటమార్పిడికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఒకే పంటను ఎక్కువ సార్లు వేయరాదు. డెల్టాలో వరి తప్ప మరో పంటకు అవకాశం లేదు. మెట్ట ప్రాంతంలో పంట మార్పిడి చేయడం మేలు. గత సీజన్‌లో మిర్చి, పొగాకు, ఇతర పంటలకు తక్కువ దరలు వచ్చాయని రైతులు కొంత ఇబ్బందులు పడ్డారు. ఈఏడాది నీరు అందుబాటులో ఉంటే ముందుగానే మొక్కజన్న వేయడానికి కూడా కొంత మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ ఏడాది ఇతర పంటలు వేయడానికి మొగ్గుచూపుతున్నారు.

ఈ ఏడాది ఏ పంట ఎక్కువగా సాగుకు అవకాశం ఉంది?

గత సీజన్‌లో మిర్చి, పత్తి, ఇతర పంటలకు ధరలు రాకపోవడం వల్ల ఈ ఏడాది పత్తి సాగుకు రైతులు మొగ్గుచూపనున్నారు. పత్తి సాగు మేలని వాణిజ్య పంటల్లో పొగాకు, మిర్చికి వచ్చే ఏడాది కూడా ధరలు ఆశాజనకంగా ఉండవని రైతులు భావిస్తున్నారు. అందువల్ల ఈ ఏడాది పత్తి విస్తీర్ణం గత ఏడాది కన్నా బాగా పెరిగే అవకాశం ఉంది.

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు

డెల్టాలో కొద్ది రోజుల వర్షాలు లేకపోతే ముందస్తుగా వెద పద్ధతితో సాగుకు అవకాశం ఉంటుంది. భారీ వర్షాలు కురిస్తే మళ్లీ భూములను సిద్ధం చేసుకునేందుకు అవకాశం ఉండదు. జిల్లాలో డెల్టా రైతులు ఏటా జులైలోనే వరి సాగు ప్రారంభిస్తారు. ఈఏడాది ముందుగా వరి సాగుకు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ వాతావరణ పరిస్థితుల బట్టి రైతుల నిర్ణయాలు ఉంటాయి. జూన్ 12,13 తేదీల్లో భారీ వర్షాలు వస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

వరిలో వెద పద్ధతి పెరిగిందా?

డెల్టాలో వరి సాగు గతంలో నాట్లు పద్ధతిలో జరిగేది. గత కొన్నేళ్లుగా వరి విత్తనాలు వెద జల్లడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. తద్వారా రైతులకు ఖర్చు తగ్గుతుంది. నాట్లుపద్ధతికి చాలా జాప్యం జరుగుతుంది. నాట్లు పద్ధతికి అధిక నీరు కావాలి. వెద పద్ధతికి నీరు తక్కువగా తీసుకుంటారు. అందువల్ల జిల్లాలో 85 శాతం మంది రైతులు వెద పద్ధతికి మొగ్గుచూపుతున్నారు. గత ఏడాది దాదాపు 80 శాతం మంది వెదపద్ధతిలోసాగు చేశారు. జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నాం.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

జిల్లాలో విత్తనాల కొరత లేదు. రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.ప్రైవేటు మార్కెట్‌లోనే రైతులు ఎక్కువగా విత్తనాలు కొంటారు. రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు చేశారు.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

ఇపిపీ సెట్‌లో వివేక విద్యార్థికి 434వ ర్యాంక్

ప్రజాశక్తి - తెనాలి

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఇపీ సెట్ ఫలితాలలో ఇంజ నీరింగ్‌లో వివేకా విద్యాసంస్థల విద్యార్థి టివి పవన్ కుమార్ ఓపెన్ కేటగిరీలో 434 ర్యాంక్ సాధించాడు. పవన్ కుమార్ జేఈఈ మెయి న్స్‌లో 99.37 శాతం, జేఈఈ అడ్వాన్స్‌డ్ లో జాతీయస్థాయిలో 4759 ర్యాంకును సాధించిన సంగతి విదితమే. మరో విద్యార్థి ఎన్ జస్వంత్ ఇపి సెట్లో 2742 ర్యాంక్ సాధించాడు. అలాగే మరో 15 మంది విద్యార్థులు 10వేల లోపు ర్యాంకులు సాధించినట్లు వీరనారాయణరావు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జ్యోతి, శ్రావణి, డీన్ ఎన్ శ్రీనివాసరావు, పిడి సునీల్, సిబ్బంది మురళి, రాంబాబు, ఠాగూర్, లావణ్య, రోజా, అనురాధ పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్‌లో భాష్యం విద్యార్థికి స్టేట్ 6వ ర్యాంకు

ప్రజాశక్తి - గుంటూరు

స్టేట్ 6వ ర్యాంకు సాధించిన విద్యార్థి టి. విక్రంలెవి

ఏపీ ఈఏపీ సెట్ - 2025 ఫలితాలలో భాష్యం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని భాష్యం విద్యాసంస్థల ఛైర్మెన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఆదివారం విడుదలైన ఫలితాలలో టి.విక్రమ్ లెవి స్టేట్ 6వ ర్యాంక్, కె. పార్థసారథి స్టేట్ 19వ ర్యాంకు, ఎ. నోషిక్ సాయి స్టేట్ 25వ ర్యాంకు, యు. తారికశ్రీ స్టేట్ 28వ ర్యాంకు, కె. విక్రాంత్ స్టేట్ 32వ ర్యాంకు, ఎస్ కె. అబ్దుర్ రహీమ్ స్టేట్ 32వ ర్యాంకు, సిహెచ్. మణికంఠ స్టేట్ 38వ ర్యాంకు, ఎస్. వెంకట సాయి చక్రి స్టేట్ 42వ ర్యాంకు, డి. జస్వంత్ బాలాజి స్టేట్ 49వ ర్యాంకు, వి.మహేష్ చంద్ర స్టేట్ 56వ ర్యాంకు, షేక్ వసీమా స్టేట్ 60వ ర్యాంకు, వి. అన్విత్ చేతన్ స్టేట్ 67 ర్యాంకు, కె. యశ్వంత్ స్టేట్ 71వ ర్యాంకు, డి.సుబాష్ స్టేట్ 73వ ర్యాంకు, యు.మణికంఠ నాయుడు స్టేట్ 74వ ర్యాంకు, పి. లక్ష్మీ నారాయణ స్టేట్ 82వ ర్యాంకు, ఎస్.ప్రేమ్ జడ్సన్ ప్రసన్న స్టేట్ 95వ ర్యాంకు, జి. సాయి మనోజ్ఞ స్టేట్ 98వ ర్యాంకు, సిహెచ్. నాగ వెంకట నీరజ్ స్టేట్ 99వ ర్యాంకు, ఎన్. సుజిత్ స్టేట్ 100వ ర్యాంకు వంటి 100లోపు 20 స్టేట్ ర్యాంకులతో భాష్యం ది బెస్ట్ అని నిరూపించారని రామకృష్ణ పేర్కొన్నారు. భాష్యం విద్యార్థి టాప్ టెన్లో ర్యాంకు కైవసం చేసుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ, మెడెక్స్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో తిరుగులేని ఫలితాలు సాధించారన్నారు. విద్యార్థులకు భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ ఛైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌రామ్ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

రాజకీయ సంకల్పంతోనే పోలీస్ సంస్కరణలు సాధ్యం

ప్రజాశక్తి - గుంటూరు

రాజకీయ సంకల్పంతోనే పోలీసు సంస్కరణలు అమలు సాధ్యం అవుతుందని విశ్రాంత ఐపిఎస్ అధికారి ఎ.బి.వెంకటేశ్వర రావు అన్నారు. ఆదివారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో పోలీస్ సంస్కరణలపై జరిగిన చర్చా గోష్టికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జైళ్లలో మగ్గుతున్న లక్షలాది మందిలో 85 శాతంపైగా విచారణ ఖైదీలుగా పేద వర్గాలే ఉన్నారన్నారు. న్యాయస్థానాలను రెట్టింపు చేయడం ద్వారా న్యాయాన్ని అందరికీ అందించగలమని, తద్వారా థర్డ్‌డిగ్రీ ప్రయోగించకుండానే నేర నిరూపణతో నేరాలను తగ్గించవచ్చునన్నారు. పోలీసు లలో నైపుణ్యాలను పెంచి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం, నేర పరిశోధనను, నేర విచారణ నుండి వేరుచేస్తేనే సత్వర న్యాయం అందుతుం దన్నారు. ఇటీవల

మాట్లాడుతున్న విశ్రాంత ఐపిఎస్ అధికారి వెంకటేశ్వరరావు

తెనాలిలో ముగ్గురు యువకులను ప్రజల మద్య బహిరంగంగా చావబాది, ఆ వీడియోను ఉద్దేశ్య పూర్వకంగా ప్రజల ముందు ఉంచి, ప్రజల్లో భయాందోళనలు కలిగించడానికి ప్రయత్నిం చడం అమానుషమని పేర్కొని, సంబంధిత పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి అదనపు వ్యయం లేకుండానే దఅఢమైన రాజకీయ సంకల్పం, చిత్తశుద్ధి ఉంటే ప్రస్తుత సిబ్బంది, వనరులతోనే 75 శాతం మేర సంస్కరణలు తీసుకొని రావచ్చన్నారు. సభకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీస్ యం త్రాంగం అధికార పార్టీకి ప్రైవేట్ ఆర్మీగా మారిందని వారి కనుసన్నలలో క్షేత్రస్థాయిలో పోలీసులు వ్యవహరిస్తున్నారని, దీని వలన చట్టబద్ధ పాలనకు భంగం వాటిల్లుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సామాన్యులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వారి సమస్యలను చెప్పుకోవటానికి భయపడే వాతావరణం నేడు ఉందని, ఫ్రెండ్లీ పోలీస్ రావాలని కోరారు. కార్యక్రమంలో విద్యావేత్తలు ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్ర హ్మణ్యం, కన్నా మాస్టర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆలా వెంకటేశ్వరరావు, మానవత ఛైర్మన్ పావులూరి రమేష్, సామాజిక విశ్లేషకులు టీ. ధనుంజయ రెడ్డి, విశ్రాంత అడిషనల్ ఎస్పీ చలపతిరావు, డిబిఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షులు నడింపల్లి గురుదత్ తదితరులు ప్రసంగించారు.